## సారు సాయం.. మా ఇల్లు నిలవెట్టింది

**సంపాదించేటోడు** పోతే ఆ ఇల్లు ఆగమైతది. దిక్కు దివానం లేకుండ పోతది. మా ఆయన పోయినప్పుడు మా బతుకులు గిన గట్లనే ఎటూ కాకుండా అయితయనుకున్న. ఉన్నన్ని దినాలు అన్నీ ఆయనే సూస్కునే సరికి పిల్లలకు ఏడెట్ల జేయాల్నో గూడా తెల్వకపోతుండే! మా ఆయన పేరు కిష్టయ్య. 12 గుంటల జాగ ఉంది. ఏదో తిప్పలు పడి మమ్మల్ని సాదెటోడు. కిడ్నీ బీమారొచ్చి రెండేండ్లు మంచంలనే ఉన్నడు. అప్పులు చేసి పట్నం దవాఖానల సూపించినా మంచిగ కాలే! ఎన్ని పైసలు కర్సు పెట్టినా పానం దక్కలే. కరోనా టైంల కాలం చేసిండు. రేపటి సంది మా బతుకులు ఎట్ల ఎల్తయని మస్తు పరేషానైన! మా ఊరోళ్లు ధైర్నం చెప్పిండ్రు. రైతు పోతే కేసీఆర్ సారు ఐదు లచ్చలు సాయం చేస్తడని అన్నరు. ఆల్లు చెప్పినట్టే ఐదొద్దులకు జిరాయితోళ్లు అచ్చిండ్రు. పాస్ బుక్కు, ఆధార్‌కార్డు అడిగిండ్రు, కాయిదాల మీద సంతకాలు తీసుకున్నరు. వారం రోజులకు మల్లా అచ్చి నీ బ్యాంకుల ఐదు లక్షలు వడ్డయ్ సూసుకున్నవా అంటే నేను నమ్మలే. నిజంగనే నా అకౌంట్ల ఐదు లచ్చలున్నయని మా కొడుకు సూసి చెప్పిండు. రెండు లచ్చలతోని అప్పులు తేర్చినం. మూడు లచ్చలు పెట్టి ఇంటి ముందు జాగల ఇల్లు కట్టుకున్నం. కేసీఆర్ సారు చేసిన సాయం యాది మరువం. మా కిష్టయ్య ఏ లోకంల ఉన్నడో గని, ఈ పొద్దు మా బతుకులు చూసి ఆయన ఆత్మ నిమ్మలమైతది.

- నానిగళ్ల పెంటవ్వ, జంగమాయపల్లి, ఎల్లారెడ్డి, కామారెడ్డి జిల్లా

ఒకప్పుడు రైతు కాలం చేస్తే.. ఆ అన్నదాత ఇల్లు పస్తులుండాల్సిన దుస్థితి. వారిని ఆదుకోవాలనే ఆలోచన 55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్‌కు ఏనాడూ రాలేదు. దేశానికి అన్నం పెట్టే ఇల్లు ఆగం కావొద్దనీ, రైతు కాలం చేస్తే ఆ కుటుంబం రోడ్డున పడొద్దనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో రైతు బీమా పథకాన్ని తీసుకొచ్చింది. గుంట పొలమున్న రైతుకు కూడా బీమా వర్తింపజేసింది. రూపాయి ఖర్చులేకుండా రూ.5 లక్షల జీవిత బీమాను అందిస్తున్నది. గడిచిన ఐదేండ్లలో 1,11,320 రైతు కుటుంబాలకు రూ.5,566 కోట్ల పరిహారం అందజేసింది కేసీఆర్ ప్రభుత్వం.

**ముందుకు పోదామా! ఎన్కకా!!**



హైదరాబాద్ | శుక్రవారం 17 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com



## ఫ్లోరైడ్‌ను తరిమికొట్టినం

నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతం ఒక జనరేషన్‌ను నాశనం చేసింది. లక్షాయాభైవేల మంది జీవితాలను పొట్టనపెట్టుకుంది. ఒక్కరన్న మాట్లాడిన్రా! కొట్లాడిన్రా! ప్రయత్నం చేసింద్రా!! ఉద్యమాలు చేయకపోగా, చేసినవాళ్లను అవమాన పరిచారు. బొక్కలు వంకరపోయినా, నడుములు వంగిపోయినా.. ఎవరూ మాట్లాడలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వంద శాతం ఫ్లోరైడ్ భూతాన్ని తరిమేసింది. మంచినీళ్లను అందిస్తున్నది.

- కేసీఆర్

ఎటమటం!

## పెద్ద సార్ ఎంత పని చేశారు!


**ఇదే** మాట వారం, పది రోజుల కిందట అని ఉంటే.. తన పరిస్థితి మరోలా ఉండేదని నాన్ కంటెస్టెడ్ పొలిటికల్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల లబోదిబోమంటున్నారు. తనను ఉద్దేశించి సీఎం కేసీఆర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఓ నెల కిందట గానీ చేసి ఉంటే, తన పార్టీని మూసేసి ఉండేదాన్ని కాదని తెగ బాధపడిపోతున్నారట. అసలు షర్మిల ఇంతలా ఎందుకు ఆవేదన చెందుతున్నది? ఆ కథాకమామిషు ఏమిటంటే, తెలంగాణ గడ్డపై రాజన్న రాజ్యం స్థాపించే లక్ష్యంతో వైఎస్ఆర్‌టీపీని స్థాపించిందామె. మునుపెన్నడూ మరెవ్వరూ చేయని విధంగా మూడున్నర వేల కిలోమీటర్లు 'పాదాల మీద నడిచే పాదయాత్ర' చేసి చరిత్ర సృష్టించింది. ఆ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌పై, ఆ పార్టీ ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు, ఘాటు విమర్శలు గుప్పించింది. అయినా సీఎం కేసీఆర్ ఏ మాత్రం స్పందించకపోగా చాలా లైట్ తీసుకున్నారు. పాదాలు అరిగేలా తిరిగినా, అరిచి గీపెట్టినా కేసీఆర్ పట్టించుకోకపోవడంతో తీవ్ర నిరాశా, నిస్పృహలకు లోనైంది.



ఇక లాభం లేదని తన పార్టీని హోల్‌సేల్‌గా కాంగ్రెస్ పార్టీకి అంటగట్టాలని చూసింది. అయితే సరుకులేని పార్టీతో ఎలాంటి లాభం లేదని టీపీసీసీని ఫ్రాంచైజీ తీసుకున్న రేవంత్ రెడ్డి అడ్డుతగిలారు. ఆమే వద్దూ.. ఆమె పార్టీ వద్దూ అని తేల్చేశారు. దీంతో తన పార్టీని ఎవరికి అమ్మడం లేదు.. తామే ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించింది షర్మిల. పార్టీ టికెట్లను పబ్లిక్ షేర్లుగా విడుదల చేసినా కొనడానికి ఎవరూ సాహసించలేదు. దీంతో రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది ఆమె పరిస్థితి. అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైంది. అదేమిటంటే.. తన గురించి ఏ రోజూ నోరు విప్పని సీఎం కేసీఆర్, పార్టీని క్లోజ్ చేశాక నర్సంపేట సభలో 'వైఎస్ షర్మిల అనే ఆమె మన అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని ఓడించేందుకు డబ్బుల సంచులు పంపిస్తుందటా.. మరి ఆయన గెలవాలా? షర్మిల నోట్ల కట్టలు గెలవాలా?' అని ప్రజలను ప్రశ్నించారు. దీంతో అబ్బా.. పెద్దసార్ ఎంత పనిచేశారు! ఇదే మాట ఓ నెల కిందట అన్నా తన పార్టీ ఎక్కడికో వెళ్లేదనీ, తన జెండా ఎత్తేయాల్సి వచ్చేది కాదనీ బావురుమంటున్నారట. అవును నిజమే, పాపం... షర్మిల పార్టీకి అప్పుడే నూరేండ్లు నిండేవి కాదని జై షర్మిల బ్యాచ్ ఓదార్చుతున్నట్టు వినికిడి.

- వెల్జాల

థౌజండ్ వాలా..





## నాడు: ప్రధానమంత్రి పట్టించుకోలే



ఇక్కడ ఫొటోలో నాటి ప్రధాని వాజపేయి ముందు బల్ల మీద పడుకున్న వ్యక్తి మర్రిగూడ మండలం శివన్నగూడేనికి చెందిన ఫ్లోరోసిస్ బాధితుడు అంశాల స్వామి. 'అయ్యా మా బతుకులు గిట్లున్నయ్! మా పిల్లలను ఫ్లోరోసిస్ రక్కసి పీడిస్తున్నది' అని స్వయంగా ప్రధానికి వివరించిన సందర్భమది. ప్రధాని భారంగా నిట్టూర్చారు, బాధగా పరామర్శించారు. కానీ, నల్లగొండ గుండె మీద పడ్డ ఫ్లోరోసిస్ బండను తొలగించే ప్రయత్నం బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ఏదీ చేయలేదు.

## నేడు: ముఖ్యమంత్రి మాట తప్పలే



'తెలంగాణ వచ్చాక నల్లగొండలో ఫ్లోరోసిస్‌ను తరిమికొడతం'... ఉద్యమ నేతగా కేసీఆర్ ఇచ్చిన మాట ఇది. ముఖ్యమంత్రి అయ్యాక మిషన్ భగీరథకు అప్పటి నల్లగొండ జిల్లా చౌటుప్పల్ నుంచే శ్రీకారం చుట్టారాయన. ఫ్లోరైడ్ సమస్యను సమూలంగా రూపుమాపారు. ఇప్పుడు స్వామి ఇంటికి రక్షిత కృష్ణా జలాలు వస్తున్నాయి. ఫ్లోరోసిస్ గండం తప్పిన నల్లగొండను కండ్లారా చూసి మనసారా తృప్తి చెందిన స్వామి ఊహించని ప్రమాదంలో కొన్నాళ్ల క్రితం కన్నుమూశారు.

# ఇన్నాళ్లకు మంచినీళ్లు తాగుతున్నాం

## కేసీఆర్ విజన్‌తో ఫ్లోరైడ్ పరార్

నాడు మంచినీళ్ల కోసం విలవిల్లాడిన ప్రజల దైన్యానికీ.. నేడు శుద్ధమైన జలాలతో గొంతు తడుపుకొంటున్న జనాల ఆనందానికీ ప్రత్యక్ష సాక్షి ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కంచుకట్ల సుభాష్. 1992 నుంచి ఉద్యమిస్తూ కాంగ్రెస్ పాలకుల పట్టింపులేని తనాన్ని ప్రశ్నించిన వ్యక్తి ఆయన. కాలకూట విషాన్ని తాగలేమని ఆక్రందించిన ఆ గొంతుక.. మా నీటి గోస తీర్చిన కేసీఆరే మళ్లీ గెలుస్తారని ఎలుగెత్తి చెబుతున్నది. నాటి పోరాటాన్ని.. నేటి విజయాన్ని.. 'నమస్తే తెలంగాణ'తో కంచుకట్ల పంచుకున్నారిలా..

ఆ గడ్డన పుట్టడం శాపం... ఆ ఊర్లకు పోవాలంటే భయం.. గుక్కెడు నీళ్లు తాగాలంటే వణుకు.. ఇదీ దశాబ్దాలుగా గుండె మీద ఫ్లోరైడ్ బండ మోసిన నల్లగొండ జిల్లా దుస్థితి. కాకులు దూరని కారడవిలో లేదు ఆ ప్రాంతం. కాకలు తీరిన యోధులమని చెప్పుకొనే కాంగ్రెస్ నేతలకు పుట్టినిల్లు. అర్ధశతాబ్దానికిపైగా రాజ్యమేలినా.. ఫ్లోరైడ్ భూతాన్ని తరమలేని అసమర్థతే వారి ఘనత. తరతరాలు అష్టవంకర్లతో తల్లడిల్లినా ఈ పెద్దమనుషుల కరకు గుండె కరగలేదు. బూజు పట్టిన బుర్రలను దులపలేదు. మంచినీళ్లు ఇవ్వలేదు.

ఉద్యమంలో భాగంగా తెలంగాణ అంతా కలియ తిరిగిన కేసీఆర్ కంటతడి పెట్టుకున్న ప్రాంతాలు ఎన్నో. అందులో ఒకటి మునుగోడు. పద్నాలుగేండ్లలో పోరాట కాలంలో.. ఫ్లోరైడ్ పీడిత మునుగోడు పరిసరాల్లో ఆయన ఐదుసార్లు పర్యటించారు. తెలంగాణ సాధిస్తామన్న నమ్మకం.. వచ్చిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న పట్టుదలతో నాడు మునుగోడువాసులకు ఒక మాటిచ్చారు. ఫ్లోరైడ్ రక్కసి తరిమి కొడతామని అభయమిచ్చారు. అన్నట్టుగానే.. తెలంగాణ రాగానే మిషన్ భగీరథకు శ్రీకారం చుట్టారు. ఫ్లోరైడ్‌ను తరిమి శుద్ధ జలాలతో మునుగోడు గోడు తీర్చారు.

- మిషన్ భగీరథతో మును'గోడు' తీరింది
- దశాబ్దాల సమస్యకు ఏడాదిన్నరలో పరిష్కారం
- ఇప్పుడు ఒక్క ఫ్లోరైడ్ కేసూ లేదు
- ఉద్యమించినా కాంగ్రెస్ కనికరించలే
- ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి నేత డాక్టర్ కంచుకట్ల సుభాష్

**గతంలో ఇక్కడ ఫ్లోరైడ్ సమస్య తీవ్రత ఎలా ఉండేదో చెబుతారా?**

**ఈ** గడ్డ మీద బిడ్డకు జన్మనివ్వాలంటేనే తల్లిదండ్రులు భయపడే రోజులు నాకు తెలుసు. పరాయి ఊరు నుంచి చుట్టాలొస్తే నీళ్లు తాగడానికి మొహమాటపడటమూ చూశాను. ఏదైనా ఫ్యాక్టరీ వస్తేనో, సాగునీటి ప్రాజెక్టు కింద పోతేనో ఊళ్లు ఖాళీ అవ్వడమే మనకు తెలుసు. కానీ, తాగడానికి మంచినీళ్లు లేక ఊళ్లకు ఊళ్లు వలసపోయిన సందర్భం మునుగోడులో మాత్రమే కనిపించేది.

**బోర్లు, బావుల నీళ్లు కూడా తాగడానికి వీలు లేకుండా ఉండేవా?**

**ఈ** నేల పొరల్లో ఫ్లోరైడ్ పాతాళం వరకూ పేరుకుపోయింది. నల్లగొండ జిల్లా మర్రిగూడెం బట్టపల్లి అనే ఊరిలో దాదాపు 250కి పైగా కుటుంబాలు నివాసం ఉండేవి. ఈ పల్లెలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఫ్లోరైడ్ పీడితులే. చేతులు, కాళ్లు వంకర తిరిగి.. నడి వయస్సులోనే ముసలితనాన్ని అనుభవించేవారు. పలు పరిశోధనల్లో ఇక్కడి బోర్ల నీళ్లు తాగడం వల్ల ఇది వస్తుందని తేలింది. ఆ నీటిని పరీక్షిస్తే ఏకంగా 28 పీపీఎం ఫ్లోరైడ్ ఉన్నట్టు తేలింది. సాధారణంగా తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం 0.5 పీపీఎం నుంచి 1 పీపీఎం వరకు మాత్రమే ఉండాలి. అలాంటిది 28 పీపీఎం ఉందంటే సమస్య ఎంత తీవ్రంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

**తాగునీటి కోసం మీరు చాలా ఉద్యమాలు చేశారు కదా! అప్పటి పాలకులు పట్టించుకోలేదా?**

**'ఇక్కడి** ప్రజలు విషం తాగుతున్నారయ్యా' అని గొంతు చించుకొని అరిచినా సమైక్య పాలకులకు పట్టలేదు. నల్లగొండ జిల్లాలోనే నాగార్జునసాగర్ కట్టినా.. నీళ్లివ్వలేదు. కాల్వలు లేకపోవడంతో భూగర్భ జలాలే దిక్కయ్యాయి. వేలాదిగా బోర్లు వేయడంతో ఫ్లోరైడ్ సమస్య జడలు విప్పింది. నిత్యం ఈ నీళ్లే తాగడంతో మూడు తరాలు ఛిద్రమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాధితులంతా ఒక్కటై 'ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి'ని ఏర్పాటు చేసుకుని గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమించాం.

**ఉద్యమ సమయంలో మీ సమస్యను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారా?**

**తెలంగాణ** ఉద్యమ కాలంలో కేసీఆర్ మునుగోడుకు ఐదుసార్లు వచ్చారు. ఒకసారి మూడు రోజులు ఇక్కడే ఉండి ఫ్లోరైడ్ బాధితుల కష్టాలు చూసి చలించిపోయారు. మా పోరాట సమితి కార్యాలయానికి వచ్చి మూడు గంటలు అనేక విషయాలపై చర్చించారు. 'రాష్ట్రం రాగానే దీని సంగతి తేలుద్దాం' అని ఆనాడే మాట ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం తెలంగాణ ముఖ్యమంత్రిగా రూ.50వేల కోట్లతో ఇంటింటికీ రక్షిత మంచినీరు ఇచ్చే మిషన్ భగీరథ ఫైల్‌పైనే తొలి సంతకం చేశారు.

> **కేసీఆర్‌ను మర్చిపోం**
>
> **డిండి** పూర్తయి నీళ్లొస్తే.. మునుగోడు ప్రాంతం మరో కోనసీమగా మారుతుంది. నల్లగొండ జిల్లాలో సారవంతమైన భూములు ఉన్నాయి. ఒక్కసారి నీళ్లు ఇవ్వగలిగితే ఇక్కడే ఉపాధి లభిస్తుంది. ఇదంతా కేసీఆర్ విజన్ వల్ల జరుగుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నల్లగొండ బిడ్డలు ఎన్నటికీ మర్చిపోరు.



కంచుకట్ల సుభాష్

**మిషన్ భగీరథ ఫలవంతమైందని భావిస్తున్నారా?**

**మునుగోడు** నియోజకవర్గంలోని చౌటుప్పల్‌లో పైలాన్ ఆవిష్కరణతో 'మిషన్ భగీరథ'కు శ్రీకారం చుట్టారు కేసీఆర్. నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రమంతటా ఇంటింటికీ నీళ్లిచ్చి తన చిత్తశుద్ధిని చాటారు. ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామం బట్టపల్లిలోనే అతి పెద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటును నిర్మించారు. దీని ద్వారానే వందలాది గ్రామాలకు నీటి సరఫరా జరుగుతున్నది. దశాబ్దాల తర్వాత మేం మంచినీళ్లు తాగుతున్నం. భగీరథ వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో కొత్తగా ఒక్క ఫ్లోరైడ్ కేసు కూడా నమోదు కాలేదు. ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించక తప్పలేదు.

**ఫ్లోరైడ్ సమస్య పూర్తిగా పరిష్కారమైనట్టేనా?**

**ఇంటింటికీ** నీళ్లు అందడంతో మునుగోడులో కొత్తగా ఫ్లోరైడ్ జాడలు కనిపించడం లేదు. పంటల ద్వారా వచ్చే ఫ్లోరైడ్‌ను నివారించాలంటే ప్రాజెక్టులు కట్టాల్సిందే. అందుకే ఇక్కడ డిండి ఎత్తిపోతలకు 2015లోనే సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. శివన్నగూడెం, కిష్టరాంపల్లి రిజర్వాయర్ల పనులతో ఇప్పటికే చుట్టుపక్కల భూగర్భజలాలు పెరిగాయి.

**తాగునీటి సమస్య తీరింది. సాగునీటి విషయంలో ప్రభుత్వం ఎలా అండగా ఉంటున్నది?**

**కాంగ్రెస్** నేతలకు మునుగోడు కష్టాలు ఎన్నడూ పట్టలేదు. నల్లగొండ సొరంగాన్ని పక్కనపెట్టేసి పోతిరెడ్డిపాడు తవ్వి రాజశేఖర్‌రెడ్డి నీళ్లు తీసుకెళ్లారు. పుంగనూర్ ద్వారా చంద్రబాబు నీళ్లు తోడ్కొని పోయారు. నల్లగొండకు మాత్రం నీళ్లు ఇవ్వలేదు. అందుకే మన నేత మనకు ఉంటేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని కేసీఆర్ నిరూపించారు. ఆయన పేరులోనే కాల్వలు.. చెరువులు.. రిజర్వాయర్లు (కేసీఆర్) అని ప్రతిధ్వనిస్తుంది. మా బతుకులు మరింత బాగుపడాలంటే కేసీఆరే మళ్లీ గెలవాలి. పని చేసే ప్రభుత్వాన్ని అందరూ కాపాడుకోవాలి.

... మర్రి మహేందర్‌రెడ్డి